క్లుప్తంగా

పాఠశాలలకే బియ్యం సరఫరాకు వినతి



భరతమాత చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందజేస్తూ..

నెల్లూరు(అర్బన్): మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన బియ్యాన్ని పాఠశాలల వద్దకే సరఫరా చేయాలని ఆపస్ జిల్లా జనరల్ సెక్రటరీ రాజగోపాల్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. క్లస్టర్ పాఠశాలల వద్దకు బియ్యాన్ని చేర్చి వెళ్లిపోతున్నారని, అక్కడికెళ్లి తీసుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచిస్తున్నారని చెప్పారు. గత సాధారణ ఎన్నికల్లో విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు చాలా నియోజకవర్గాల్లో ఆర్వో డ్యూటీ సర్టిఫికెట్లను ఇవ్వలేదని తెలిపారు. కాగా వీటి మంజూరుపై ఎంఈఓలకు ఆదేశాలను కలెక్టర్ జారీ చేశారు. అనంతరం భరతమాత చిత్రపటాన్ని కలెక్టర్‌కు బహూకరించారు.

పోతనామాత్యుని సాహిత్య సభ



నెల్లూరు(బృందావనం): పోతన మహాకవి రచించిన భాగవతంలోని ఘట్టాల్లో రుక్మిణీ కల్యాణం సుప్రసిద్ధమైందని నెల్లూరు వేదసంస్కృత కళాశాల విశ్రాంత రీడర్ గిరిజాలక్ష్మి పేర్కొన్నారు. పురమందిర ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి జూనియర్ స్మారక మందిరంలో మహాకవి పోతనామాత్యుని సాహిత్య సభను నెల్లూరు వర్ధమాన సమాజం, మోపూరు వేణుగోపాలయ్య స్మారక ధర్మనిధి సౌజన్యంతో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రుక్మిణీ కల్యాణం అనే అంశంపై ఆమె ఉపన్యసించారు. అనంతరం ఆమెను సత్కరించారు. సభాపోషకులుగా హరిప్రియ వ్యవహరించారు. మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, వెంకటస్వామి, గోవిందరాజు సుభద్రాదేవి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక స్థలంలో మట్టి తవ్వితే చర్యలు



అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

నెల్లూరు (బారకాసు): వెంకటాచలం మండలం సర్వేపల్లి బిట్ - 2లోని సర్వే నంబర్ 2954/4లో నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన 20 ఎకరాల స్థలంలో మట్టి తవ్వకాలు జరిపితే మున్సిపల్ కార్పొరేషన్ చట్టం మేరకు కఠిన చర్యలు చేపడతామని కమిషనర్ నందన్ బుధవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. స్థలంలో ఎవరైనా మట్టి తవ్వకాలు చేస్తున్నారనే విషయాన్ని గుర్తిస్తే 0861 – 2356177, 98496 63926 నంబర్లకు తెలియజేయాలని కోరారు.

వైద్య విద్యకు దూరం చేసే కుట్ర

నెల్లూరు సిటీ: పీపీపీ విధానాన్ని అమలు చేస్తూ పేదలకు వైద్య విద్యను కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శ్రీరామ్ ఆరోపించారు. గొల్లకందుకూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కుట్రలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు.

రేటింగులిస్తే డబ్బులొస్తాయంటూ మోసం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఇంటి వద్దే ఉంటూ రేటింగులిస్తే డబ్బులొస్తాయంటూ యువకుడ్ని నమ్మించి దోచుకున్న ఘటనపై కేసును చిన్నబజార్ పోలీసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేటలోని చాముండితోటలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి వెంకటేశ్వరరావు కుటుంబం నివాసం ఉంటోంది. ఆయన కుమారుడు హర్షవర్ధన్ ఇంజినీరింగ్‌ను పూర్తి చేసి ఖాళీగా ఉంటున్నారు. ఈ తరుణంలో గుర్తుతెలియని యువతి ఆయనకు ఏప్రిల్ ఒకటిన ఫోన్ చేసింది. టెలిగ్రామ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని దాని ద్వారా రెస్టారెంట్లు, హోటళ్లకు గూగుల్‌లో రేటింగ్ ఇస్తే నెలకు రూ.14 వేలు వస్తాయని నమ్మబలికారు. దీంతో కొంత నగదును చెల్లించాలని కోరగా, పలు విడతల్లో రూ.5,58,600 మొత్తాన్ని ఆమె బ్యాంక్ ఖాతాకు జమ చేశారు. తిరిగి ఫోన్ చేయడంతో స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు దర్యాప్తు చేస్తున్నారు.

‘అన్నదాత పోరు’ విజయవంతం



మాట్లాడుతున్న పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): పోలీసులు ఎంత అడ్డుకున్నా, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందుకొచ్చి అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలిసి విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని చెప్పారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల నష్టానికి రైతులు అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

15 నుంచి డాక్యుమెంట్ రైటర్ల పెన్‌డౌన్

నెల్లూరు సిటీ: రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జరుగుతున్న సాఫ్ట్‌వేర్ మార్పులతో జిల్లాలోని డాక్యుమెంట్ రైటర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమస్యను పరిష్కరించేంత వరకు పెన్‌డౌన్ కార్యక్రమాన్ని ఈ నెల 15 నుంచి చేపట్టనున్నామని దస్తావేజుల లేఖరుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు పట్నం దుర్గేష్‌బాబు, నెల్లూరు సిటీ డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలవెంకటఅశోక్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. చింతారెడ్డిపాళెంలోని తన నివాసంలో 21వ డివిజన్ నేతలు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం పార్టీ డివిజన్ ఇన్‌చార్జ్‌గా రజినిని నియమించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చెవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర జోనల్ మహిళాధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, నేతలు మొయిళ్ల సురేష్‌రెడ్డి, రాజారెడ్డి, సతీష్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, రాజశేఖర్, రమాదేవి, వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

⇨ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం నిర్వహించనున్న ఎస్సీ సెల్ జిల్లా స్థాయి సమావేశానికి పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డిని ఆ విభాగ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు ఆహ్వానించారు. ఈ మేరకు చింతారెడ్డిపాళెంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రావు శ్రీనివాసరావు, ఎస్సీ విభాగ కోవూరు, నెల్లూరు రూరల్, నగరాధ్యక్షులు అనపల్లి ఉదయ్‌భాస్కర్, జాషువా, నవకోటి రాహుల్, నేతలు బాలాజీ, మధు తదితరులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్ పరీక్షలు చేయాలి



మాట్లాడుతున్న సుజాత



వివరాలను ఆరాతీస్తున్న నితీష్‌రామ్

నెల్లూరు(అర్బన్): టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా సీహెచ్‌సీలకు వచ్చే రోగులకు స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించి, వివరాలను నిశ్చయ పోర్టల్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌ఓ సుజాత సూచించారు. నగరంలోని జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో టీబీ, ఎయిడ్స్ నివారణాధికారి ఖాదర్‌వలీ, వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ డాక్టర్ నితీష్‌రామ్‌తో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. దగ్గు, జ్వరం తదితర లక్షణాలున్న వారికి కఫం పరీక్షలను చేయాలని సూచించారు. అనంతరం టీబీ రోగులకు అందుతున్న వైద్యంపై నితీష్‌రామ్ క్షేత్రస్థాయిలో ఆరాతీశారు. జిల్లా టీబీ నివారణ కోఆర్డినేటర్ విజయకుమార్, శ్రావణ్‌కుమార్, వేణు, శోభారాణి పాల్గొన్నారు.

సీఈఓను కలిసిన ఎంపీడీఓలు



నెల్లూరు(పొగతోట): డిప్యూటీ ఎంపీడీఓల నుంచి ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతులు పొందిన పలువుర్ని తిరుపతి, చిత్తూరు జిల్లాలకు కేటాయించారు. ఈ క్రమంలో వీరు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు, డీపీఓ శ్రీధర్‌రెడ్డిని వారి కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు.

సమస్యలు తెలియజేస్తే పరిష్కారం



మాట్లాడుతున్న జడ్జి వాణి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): హాస్టళ్లలో ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని సీనియర్ సివిల్ జడ్జి వాణి పేర్కొన్నారు. దర్గామిట్టలోని బాలుర, బాలికల వసతిగృహాలను బుధవారం తనిఖీ చేశారు. భోజన వసతి, బాత్‌రూములు తదితరాలను ఆరాతీశారు. గుడ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఆధార్‌కార్డు, జనన సర్టిఫికెట్ లేకపోతే.. జిల్లా జడ్జి ద్వారా అధికారులతో మాట్లాడి అందేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాలధారణ



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకొని అర్ధమండల మాలధారణను భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. పూజా కార్యక్రమాలను దేవస్థాన ప్రధానార్చకుడు సూరావఝుల రఘురామ్మూర్తి ఆధ్వర్యంలో జరిపారు. విశేషాలంకారంలో కొలువైన అమ్మవారిని భక్తులు దర్శించుకొని ప్రణమిల్లారు. అర్ధమండల దీక్ష 21 రోజుల పాటు జరగనుందని ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. రాజరాజేశ్వరి అమ్మవారి సేవా సమితి అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘పెరుగు’కు పురస్కార ప్రదానం



నెల్లూరు(బృందావనం): గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వ, భాషా సాంస్కృతిక శాఖ ప్రకటించిన గిడుగు తెలుగు భాషా పురస్కారాన్ని నెల్లూరుకు చెందిన కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ అందుకున్నారు. భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్, సృజనాత్మక సంస్కృతి సమితి ముఖ్య కార్యనిర్వహణాధికారి మల్లికార్జునరావు తనకు విజయవాడలో పురస్కారాన్ని బుధవారం అందజేశారని ఆయన చెప్పారు. ఈ క్రమంలో ప్రోత్సాహకంగా రూ.25 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసపత్రాన్ని అందజేశారు.

దేవస్థాన పాలకవర్గ నియామకం

నెల్లూరు(బృందావనం): సింహపురి గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన పాలకమండలిని నియమిస్తూ ఉత్తర్వులను ఆంధ్రప్రదేశ్ ధార్మిక పరిషత్ మెంబర్ సెక్రటరీ, కమిషనర్ రామచంద్రమోహన్ బుధవారం జారీ చేశారు. కమిటీ చైర్మన్‌గా ఒట్టూరు సురేంద్రయాదవ్, సభ్యులుగా అల్లం లక్ష్మి, తమ్మినేని వెంకటరత్నంనాయుడు, కొండా కోటేశ్వరరెడ్డి, చెంచయ్య, కుమార్ హరికుమార్, మన్నేపల్లి వెంకటలక్ష్మి ప్రసూన, ముమ్మిడి కుమార్, మిడతల మహాలక్ష్మి, ఎక్స్ అఫీషియో సభ్యుడిగా పులికొలను చంద్రశేఖర్ నియమితులయ్యారు.

రేపట్నుంచి కృతజ్ఞతార్పణల పండగ

నెల్లూరు(బృందావనం): నగరంలోని బాప్టిస్ట్ చర్చి డొనీహాల్ వార్షిక కృతజ్ఞతార్పణల పండగను ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహించనున్నామని చర్చి కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్తుతి ఆరాధనతో పండగ శుక్రవారం సాయంత్రం 6.30కు చర్చిలో ప్రారంభంకానుందని చెప్పారు. ఫుడ్, బుక్ స్టాళ్లతో పాటు బైబిల్ సంబంధిత క్విజ్, ఆటల పోటీలను శనివారం ఉదయం ఎనిమిది నుంచి నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక కృతజ్ఞతారాధనను ఆదివారం నిర్వహించనున్నామన్నారు.

వ్యక్తిగత కక్షతోనే ఆరోపణలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వ్యక్తిగత కక్షతోనే సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య, రమణయ్యపై తమ పొదుపు సంఘానికి చెందిన కొందరు ఆరోపణలు చేయడం తగదని ఇందుకూరుపేట మండలం కొత్తూరు – చింతోపునకు చెందిన స్వస్తిక్ పొదుపు గ్రూపు అరుంధతి మహిళలు లేబూరు కళావతి, సింధూ, మాధవి పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. నారాయణమ్మ, సునీత, లక్ష్మి, వెంకటరమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(అర్బన్): విశ్వకర్మ జయంతి, ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆయన గోత్రనామాలతో యజ్ఞోత్సవాలను ఈ నెల 17న నిర్వహించనున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మేకల హనుమంతరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి బుచ్చిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్‌కుమార్, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగదు అడిగితే చంపుతామని బెదిరింపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): వ్యాపార భాగస్వామిగా చేసుకుంటానని నమ్మించి మోసం చేశారని, నగదు అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారంటూ వేదాయపాళెం పోలీసులకు ఓ మహిళ బుధవారం ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు.. ఇస్కాన్ సిటీ ఇందిరానగర్‌లో వడ్డి ప్రియాంక నివాసం ఉంటున్నారు. బీవీనగర్‌లోని పెట్రోల్ బంకు యజమాని గడ్డం ప్రసాద్ ద్వారా గతేడాది నవంబర్‌లో ధనలక్ష్మీపురానికి చెందిన గుంటుపల్లి అంజనీదేవి, ఆమె భర్త రాంబాబు, వారి కుమారుడు కార్తీక్, కుమార్తె గాయత్రి, అల్లుడు వెంకటదీప్.. ప్రియాంకకు పరిచయమయ్యారు. బ్యాంకుల్లో వేలమేసిన బంగారు నగలను కొనుగోలు చేసి కొత్తవిగా చేసి విక్రయించడం ద్వారా అధికంగా లాభాలొస్తాయని ప్రియాంకను వారు నమ్మించారు. దీంతో పలుదఫాలుగా రూ.నాలుగు కోట్లను అంజనీదేవి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు. కాగా ప్రియాంకకు నగదు అవసరమై ఆమెను అడగ్గా, పలుమార్లుగా రూ.1.90 కోట్లు ఇచ్చారు. మిగిలిన మొత్తానికి ధనలక్ష్మీపురంలోని శ్రీసాయికృష్ణ నగర్‌లో ఉన్న ఒక ప్లాట్‌ను ప్రియాంక పేరుపై రిజిస్టర్ చేయించారు. ప్లాట్ విలువ రూ.1.2 కోట్లు కాగా, దానిపై ఉన్న బ్యాంక్ లోన్ రూ.47 లక్షలను ప్రియాంక చెల్లించి రిజిస్టర్ చేయించుకున్నారు. లింక్ డాక్యుమెంట్లు, మిగిలిన నగదు ఇవ్వడం లేదని, అడిగితే చంపుతామని అంజనీదేవి కుటుంబ సభ్యులు బెదిరిస్తున్నారని పోలీసులకు ప్రియాంక ఫిర్యాదు చేశారు.

నష్ట పరిహార నగదు స్వాహాపై ఫిర్యాదు

నెల్లూరు సిటీ: యానాదుల సంక్షేమ సంఘానికి చెందిన పెంచలయ్య, ఉషాపై కేసును నెల్లూరు రూరల్ పోలీసులు బుధవారం నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. సజ్జాపురానికి చెందిన ఓ మహిళపై 2022లో లైంగిక దాడి జరిగింది. ఈ క్రమంలో అట్రాసిటీ కేసు అప్పట్లోనే నమోదైంది. ఈ తరుణంలో ఆమెకు రూ.1.5 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వం అందజేసింది. ఇందులో రూ.50 వేలను కొన్ని నెలల క్రితం డ్రా చేయగా, ఇందులో రూ.40 వేలు సంక్షేమ సంఘానికి కావాలంటూ పెంచలయ్య, ఉషా తీసుకున్నారు. కొన్ని రోజుల తర్వాత చెక్కుపై ఆమె సంతకాన్ని తీసుకొని రూ.లక్షను డ్రా చేసుకొస్తామని చెప్పారు. ఇందులో రూ.ఐదు వేలను మహిళకు ఇచ్చి, మిగిలిన మొత్తాన్ని సంక్షేమ సంఘ ఖర్చులకంటూ తీసుకున్నారు. కేసులో నిందితుడి వద్దా రూ.రెండు లక్షలను వసూలు చేశారని ఫిర్యాదులో బాధితురాలు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కేసుల మాఫీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి, తాగునీటి కుళాయి, ఖాళీ స్థల పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్ బకాయిదారులు తదితరులపై దాఖలు చేసిన కేసుల మాఫీకి కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నందన్ కోరారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వేలూరు రంగారావుతో కలిసి విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. పన్ను బకాయిదారులు 1500 మందిపై క్రిమినల్ కేసుల నమోదుకు ముందు ప్రీలిటిగేషన్ ద్వారా నోటీసులను జారీ చేశామని వివరించారు. నగరంలోని ప్రధాన కోర్టులో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు హాజరై బకాయిల మొత్తాలను చెల్లించి కేసులను మాఫీ చేయించుకోవాలని సూచించారు. అక్కడ ఏర్పాటు చేయనున్న పన్నుల కేంద్రంలో చెల్లించొచ్చన్నారు. చెల్లించని వారికి మూడేళ్ల శిక్షను విధించేందుకు అవకాశం ఉందని తెలిపారు.

⇨ 24వ డివిజన్లోని కల్లూరుపల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో కమిషనర్ పర్యటించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా అందిన ఫిర్యాదును ప్రత్యక్షంగా పరిశీలించారు. శాశ్వత పరిష్కారం చూపాల్సిందిగా అధికారులను ఆదేశించారు. అనంతరం పార్కును సందర్శించారు. రామలింగాపురం అండర్ బ్రిడ్జి ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి.. వీటిని నిర్దేశిత సమయంలోపు పూర్తి చేయాలని సూచించారు. అరవ శ్రీనివాసులు, మాజీ మేయర్ భానుశ్రీ, ఇంజినీరింగ్ విభాగ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఈఈ శేషగిరిరావు, ఏఈ అర్పిత, ఎంహెచ్‌ఓ కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

⇨ నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పబ్లిక్ హెల్త్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని కమిషనర్ నందన్ నిర్వహించారు. డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఎంహెచ్‌ఓ కనకాద్రి, వెటర్నరీ డాక్టర్ మదన్‌మోహన్, అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆఫీసర్ జిజియాబాయి, టీపీఆర్వో వాసుబాబు తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలపై అవగాహన



నెల్లూరు సిటీ: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సురక్ష, జీవనజ్యోతి, అటల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలని కెనరా బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సౌత్ మోపూరులో గ్రామస్తులకు బుధవారం అవగాహన కల్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. కష్టకాలంలో కుటుంబానికి బీమా ఆసరాగా ఉంటుందని వివరించారు. ఏజీఎం నాగరాజు, లీడ్ బ్యాంకు మేనేజర్ మణిశంకర్, సౌత్‌మోపూరు మేనేజర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ధైర్యాన్ని పెంపొందించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సైకాలజిస్టులు

నెల్లూరు (టౌన్): మానసిక ధైర్యాన్ని చిన్నతనం నుంచే పెంపొందించుకోవాలని సైకాలజిస్టులు డొమినిక్‌రెడ్డి, నళిని పేర్కొన్నారు. ఆత్మహత్యల నివారణపై అనే అంశంపై నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. మానసికారోగ్యాన్ని కాపాడుకోవడం, సమస్యలను సమర్థంగా ఎదుర్కోవడం తదితరాలను తెలియజేశారు. ప్రిన్సిపల్ గిరి, అధ్యాపకులు అపర్ణదేవి, మమత, తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరి జాతా విజయవంతానికి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యలు, ఆర్థిక పరమైన అంశాలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 15 నుంచి 19 వరకు చేపట్టనున్న యూటీఎఫ్ రణభేరి జాతాను విజయవంతం చేయాలని సంస్థ రాష్ట్ర కార్యదర్శి నవకోటేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి శేషు, చలపతిశర్మ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను అన్నమయ్య సర్కిల్లోని యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం వారు మాట్లాడారు. పొదలకూరు, నెల్లూరు, బుచ్చిరెడ్డిపాళెం, ఆత్మకూరు, ఉదయగిరి, వింజమూరు, కావలి, కందుకూరు తదితర ప్రాంతాల్లో జాతా ఈ నెల 17, 18న.. ఆపై విజయవాడలో బహిరంగ సభను 25న నిర్వహించనున్నారని తెలిపారు. ఉపాధ్యాయులపై యాప్‌ల భారం, పీ4, మూల్యాంకనం తదితర బోధనేతర పనులను మోపడంతో బోధనకు ఆటంకం ఏర్పడుతోందని చెప్పారు. జిల్లా కార్యదర్శి మురళీధర్‌రావు, కార్యదర్శులు నాగిరెడ్డి, సురేంద్రబాబు, బాలరామయ్య, నేతలు శ్రీనివాసులు, జమీర్ అహ్మద్, పార్వతీశం, రియాజ్, సుబ్రహ్మణ్యం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



నెల్లూరు(బారకాసు): మైపాడు రోడ్డు సెంటర్‌లోని జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద రోడ్డును కొందరు ఆక్రమించి దుకాణాలను ఏర్పాటు చేసి వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. ఈ క్రమంలో కమిషనర్ నందన్ ఆదేశాల మేరకు వీటిని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది బుధవారం తొలగించారు.

ఏపీఎంలతో సమావేశం



మాట్లాడుతున్న నాగరాజకుమారి

నెల్లూరు(పొగతోట): మన డబ్బు.. మన లెక్కలు కార్యక్రమంపై స్వయం సహాయక గ్రూపు మహిళలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి సూచించారు. నగరంలోని డీఆర్డీఏ సమావేశ మందిరంలో ఏపీఎంలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాల వివరాలు, చెల్లింపులు, బకాయిలు తదితరాలు అందుబాటులో ఉంటాయని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాల లక్ష్యాలను నూరు శాతం సాధించాలని ఆదేశించారు. డీపీఎంలు మధుసూదన్‌రావు, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను ది కన్సల్టింగ్ సివిల్ ఇంజినీర్స్ ఆర్కిటెక్ట్స్, ఎల్బీఎస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కమిషనర్ నందన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రికెట్ ఆడి అందర్నీ ఉత్సాహపర్చారు.

క్రీడా రంగంపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న సంజయ్‌కుమార్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): క్రీడా రంగంపై నిర్లక్ష్య ధోరణిని కూటమి ప్రభుత్వం అవలంబిస్తోందని, ఉద్యోగులకు జీతాలను సైతం చెల్లించడంలేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ ఆరోపించారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియాన్ని బుధవారం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడారు. 23 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులకు సగం జీతాలనే ప్రభుత్వం చెల్లిస్తోందని ధ్వజమెత్తారు. స్టేడియంలో వాలీబాల్, షటిల్, ఖోఖో, హాకీ తదితర అకాడమీలు గతంలో ఉండేవని, అయితే ప్రస్తుతం నిర్వీర్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మల్లికార్జునరెడ్డి, అడ్వొకేట్ సుధాకర్, క్రీడాకారులు ఎలీషా, గౌరవ్ తదితరులు పాల్గొన్నారు.